నేటి నుంచి కుటుంబ సమగ్ర సర్వే

- జిల్లాలో సర్వే కోసం 5,344 మంది ఎన్యూమరేటర్లు
- 6.57 లక్షల కుటుంబాలను సర్వే చేస్తాం
- సమగ్ర కుటుంబ సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి చేపట్టనున్న కుటుంబ సమగ్ర సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం నుంచి జిల్లాలో కుటుంబ సమగ్ర సర్వే ప్రారంభమవుతుందన్నారు. మొదటి మూడు రోజులు మొత్తం కుటుంబాలను గుర్తించి ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటిస్తారని తెలిపారు. ఆ తర్వాత రెండో దఫాలో పదిహేను రోజులపాటు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ సర్వే ప్రజలకు ఉపయోగపడేందుకు మాత్రమే చేస్తున్నారన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లకు సరైన సమాచారమివ్వాలని తెలిపారు. సర్వేలో విద్య, రాజకీయ తదితర అంశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాల అధ్యక్షులు సర్వే విజయవంతం చేయడానికి కృషిచేయాలన్నారు. సమాచార సేకరణలో గ్రామస్థాయిలోని వార్డు నుంచి మొదలుకుని కేటాయించిన బ్లాక్‌స్థాయి వరకు ప్రతి కుటుంబంలోని వివరాలు సక్రమంగా సేకరించాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణలో ఏమైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించుకునే దిశలో కృషిచేయాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించటం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్య, పౌరసరఫరాల అధికారి వెంకటేశం పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాథమిక పాఠశాలలకు ఒంటిపూట బడులు

బుధవారం నుంచి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని మున్సిపాలిటీలు మినహా ప్రాథమిక పాఠశాలలకు ఒంటిపూట బడులుంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించినందున ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు మాత్రమే నడుస్తాయన్నారు. సర్వే కోసం జిల్లాలో 5,344 మంది ఎన్యూమరేటర్లను నియమించామని, ఇందులో 1696 మంది టీచర్లు ఉన్నారని తెలిపారు. ఈ టీచర్లంతా సర్వేలో పాల్గొంటున్నందున మధ్యాహ్నం పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 175 ఇండ్ల చొప్పున కేటాయించామన్నారు. పదిహేను రోజుల్లో కేటాయించిన ఇండ్లల్లో ఎన్యూమరేటర్లు సర్వే చేయాలన్నారు. సెలవు రోజుల్లో కూడా చేసుకునే అవకాశముందని తెలిపారు. ప్రతి పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక్క సూపర్‌వైజర్‌ను నియమించామన్నారు. మండల, జిల్లాస్థాయిలో స్పెషల్ అధికారులను నియమించడంతో పాటు జిల్లాస్థాయిలో సర్వే మానిటరింగ్ కోర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 6.57లక్షల కుటుంబ సర్వే

జిల్లావ్యాప్తంగా 6.57 లక్షల కుటుంబాలను ఎన్యూమరేటర్లందరూ సర్వే చేయబోతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సర్వేలో జిల్లాకు వలస వచ్చినవారిని కూడా తీసుకుంటామని తెలిపారు. సర్వేలో ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేస్తున్నందున ఒకేచోట సర్వేలో వివరాలు తెలుపాలని సూచించారు. ఒక వ్యక్తి రెండు చోట్ల సర్వేలో పాల్గొనవద్దని సూచించారు. ఆధార్ ఆధారంగానే సర్వే జరుగుతున్నందున ఒక్క వ్యక్తికి ఒకే చోట సర్వే జరుగుతుందన్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో కుటుంబ సమగ్ర సర్వే చేస్తున్నందున.. దీనిని ప్రజలంతా ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాల్లో కూడా ఈ సర్వే దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు.

సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ : సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి అన్ని మండలాల స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు మున్సిపల్, గ్రామస్థాయిలో వార్డు నుంచి మొదలుకొని కేటాయించిన బ్లాక్ స్థాయి వరకు పూర్తి స్థాయిలో సమాచార సేకరణ, నమోదును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరముందన్నారు. సర్వే నిర్వహణలో ఏవైనా సందేహాలున్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అలాగే సర్వే నిర్వహణ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నేటి నుంచి మొదలవుతుందని.. సర్వే కోసం ఎన్యూమనేటర్లు, హౌస్ లిస్టింగ్, మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

ప్రతి తహసీల్దార్, ఎంపీడీవో వద్ద గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 57 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తయిన ఇంటిపై అతికించు స్టిక్కర్‌లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా, జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. మండలాలవారీగా ఎంత జనాభా ఉన్నది, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లు, మున్సిపల్ పరిధిలో వార్డులు తదితర వివరాలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా ఖరీఫ్ ధాన్యం సేకరణ జరగాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఈ సంవత్సరం కొత్తగా సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నదని తెలిపారు. జిల్లాలో సుమారు 1.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, 126 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లైట్స్, ఫాన్స్, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సీపీవో అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరిధాన్యం తేమ శాతం పరీక్షించే మిషన్ల పనితీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు

- పాడైపోయిన టార్పాలిన్ కవర్లలో ధాన్యం ఎలా ఆరబెడతారు
- కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో డీసీవో సుధాకర్, డీసీఎంఎస్ అధికారులపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆగ్రహం

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 5 : ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతన టార్పాలిన్లు, గన్నీబ్యాగులు సమకూర్చాలని ఆదేశించినప్పటికీ డీసీఎంఎస్‌లో మాత్రం నాలుగైదు టార్పాలిన్లు కొనుగోలు చేసి పాడైపోయినవి చూపించడంతో డీసీవో సుధాకర్, డీసీఎంఎస్ అధికారులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరిధాన్యంపై ఇప్పటికే మూడుసార్లు సమీక్ష నిర్వహించి ప్రతి సమీక్షలో చెప్పామని, అయినా మీకు బుర్రకెక్కలేదా అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. వెంటనే రైతులకు సరిపడా గన్నీబ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు సమయంలో తేమశాతం పరీక్షించే మిషన్లను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన పెద్దసైజు కోడిగుడ్డు

గుడ్ల సైజు పెరిగింది!

- 'అరచేతిలో ఆరు గుడ్లు'కు స్పందన
- అంగన్‌వాడీ కేంద్రాలకు సాధారణ గుడ్లు సరఫరా చేసిన ఐసీడీఎస్ అధికారులు

నమస్తే ఎఫెక్ట్

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 5 : 'అరచేతిలో ఆరు గుడ్లు' శీర్షికతో నమస్తే తెలంగాణలో ఇటీవల ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీలోని పలు కేంద్రాలకు పంపిణీ చేసిన చిన్న గుడ్లను తిరిగి వెనక్కి తీసుకెళ్లారు. మళ్లీ వాటి స్థానంలో సాధారణ గుడ్లను అందజేశారు. బాలింతలు, పసికందులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కోడి గుడ్లను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. గత నెల పలు కేంద్రాలకు పంపిణీ చేసిన గుడ్లు మరీ చిన్నవిగా వచ్చాయి. ఒక్క అరచేతిలో ఆరు గుడ్లు పట్టేలా ఉన్నాయి. గుడ్లను ట్రేలో పెట్టిన సరిగ్గా కూర్చోని పరిస్థితి ఉన్నదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 77 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పెద్దఅంబర్‌పేట, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు కలిపి 41 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. గ్రామ పంచాయతీల్లో 36 కేంద్రాలు ఉన్నట్టు సంబంధిత అధికారులు చెప్తున్నారు. ఒక్కో అంగన్‌వాడీ సెంటర్‌కు సగటున 400 నుంచి 1200కు పైగా గుడ్లు వస్తున్నాయి. నమస్తే తెలంగాణ కథనంతో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు చిన్నసైజులో ఉన్నట్టు గుర్తించిన అధికారులు.. వాటిని తిరిగి తీసుకెళ్లాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. కాంట్రాక్టర్ పలు కేంద్రాలకు మళ్లీ సాధారణ సైజులో ఉన్న గుడ్లను పంపిణీ చేశారు. చిన్నసైజులో ఉన్న గుడ్లను వెనక్కి తీసుకెళ్లారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ మాట్లాడుతూ.. సీడీపీవో ఆదేశాలతో చిన్న గుడ్లు వచ్చిన కేంద్రాలకు తిరిగి మంచి గుడ్లు వచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. చిన్నగుడ్లను తిరిగి పంపించేశామన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన, మంచి సైజులో ఉన్న గుడ్లను అందించేలా కృషి చేస్తామని చెప్పారు.

ఆయిల్ పామ్ సాగుకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిబట్ల, నవంబర్ 5 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటల సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను 3వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల సాగు లక్ష్యంగా నిర్ణయించడమైందని జిల్లా ఉద్యాన అధికారి సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాని కనుగుణంగా రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 1590 ఎకరాలకు మంజూరివ్వగా.. వివిధ మండలాల్లో 1066 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారన్నారు. మిగిలిన 1410 ఎకరాలకు నవంబర్ 2024 ఆఖరువరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. రైతులు తమ దగ్గరలో ఏర్పాటు చేసిన ఉద్యానవన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, మొదటి దరఖాస్తుకు మొదటి ప్రాధాన్యత క్రమంలో ఆమోదించబడునని ఆయన తెలిపారు. ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మాడ్గుల, మంచాల మండలాలకు ఉద్యాన అధికారిగా నవీన ఫోన్ 8977714219., చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట మండలాలకు అధికారిగా కీర్తికృష్ణ ఫోన్ 8977714222., ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాలకు అధికారిగా సౌమ్య ఫోన్ 8977714221., షాద్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడ, కొందుర్గు మండలాలకు అధికారిగా హిమబిందు ఫోన్ 8977714220లను నియమించామని తెలిపారు. ఆయా మండలాల రైతులు తమ దరఖాస్తులను వారికి అందజేయాలని ఆయన కోరారు.

పత్తి కొనుగోలుకు అన్ని చర్యలు

వికారాబాద్, నవంబర్ 5 : జిల్లాలో పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు, రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను అందించేందుకు జిల్లా యంత్రాగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్కెటింగ్ శాఖ ద్వారా వాట్సప్ నం.8897281111ను ప్రారంభించడం జరిగిందని.. దీని ద్వారా క్రాప్ బుకింగ్‌లో ఉన్న డేటా, అమ్మకం విస్తీర్ణం, పత్తి సాగు అర్హత, తక్ పట్టి వివరాలు, సీసీఐ సెంటర్‌లో వేచి యుండు సమయం, కొనుగోలు వివరాలను రైతులు తమ ఇంటి నుంచే తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని తాండూరులో-3, వికారాబాద్‌లో-3, పరిగిలో-3, కోట్‌పల్లిలో-2, ధారూరులో-1, మర్పల్లిలో-1, కొడంగల్‌లో-1 మొత్తం 14 మిల్లుల్లో సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ పత్తిని కొనుగోలు చేయడం జరుగుతున్నదన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ నెలాఖరు వరకు 286.23 మెట్రిక్ టన్నుల పత్తిని 3 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా 183 మంది రైతులు అమ్మినట్లు తెలిపారు. రైతులు కనీస మద్దతు ధర పొందాలంటే పత్తి తేమ శాతం 5 నుంచి 12 మధ్యలో ఉండేలా చూసుకోవాలని, విడిగా తీసుకురావాలని సూచించారు. దీంతో పత్తి నాణ్యత పెరుగుతుందని, దిగుమతి అయ్యే ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అయి తొందరగా అమ్మకాలు పూర్తవుతాయన్నారు. రైతులందరూ ఒకేసారి కాకుండా దశలవారీగా పూర్తిగా ఆరిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తరం జిరాక్స్, ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నంబరును తప్పక వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా అధికారులున్నారు.

నేడు శంకర్‌పల్లికి మంత్రి రాక

చేవెళ్ల రూరల్, నవంబర్ 5 : శంకర్‌పల్లికి నేడు (బుధవారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నట్లు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ రామంతాపూర్ పరిధిలో బద్దం మాణిక్యరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

మూగ బాలుడికి విద్యుదాఘాతం

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ వలయం లేక ప్రమాదం
- హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స

గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కొడంగల్, నవంబర్ 5 : మండలంలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన మహేశ్(12) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇందుకు సంబంధించి స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బస్వప్ప ఇల్లు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉంటుందని, మహేశ్‌కు మాటలు రావని, వినికిడి శబ్దం కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. బాలుడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆడుకుంటూ, వైర్‌ను పట్టుకోగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రక్షణ వలయం లేకపోవడం, విద్యుత్ అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా మహేశ్ విద్యుత్ షాక్‌కు గురైనట్లు బాలుడి తల్లిదండ్రుల తోపాటు స్థానికులు ఆరోపించారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని బాలుడి తండ్రి వాపోయాడు. విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఐక్యంగా ఉందాం.. హక్కులను సాధించుకుందాం

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

ఉద్యమకారుల అత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 5 : ఉద్యమకారులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యమకారులు అత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఉద్యమకారులు అధైర్యపడకుండా హక్కుల సాధన కోసం ఉద్యమిద్దామన్నారు. నియోజకవర్గంలో అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారుల కుటుంబానికి రూ.10లక్షల అరోగ్య బీమా, ఉద్యమకారుల కోసం రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, గౌరవ వేతనం ఇవ్వాలని, ఎన్నికల్లో ప్రభుత్వం చేసిన హామీలను నెరవేర్చాలనే తదితర హక్కులను సాధించుకునేందుకు ఉద్యమకారులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సలహాదారులుగా నరసింహారెడ్డి, రాంబల్‌నాయక్, మంగూలాల్‌నాయక్, సత్తయ్య, సురేశ్‌రెడ్డి, భూపాలచారి, రాజ్యలక్ష్మి, గౌరవ సలహాదారులగా ప్రభాకర్, మిట్టూ నాయక్, వైస్ చైర్మన్‌లుగా అర్ల యాదయ్య, రవి, సిద్దల శ్రీనాథ్, కన్వీనర్లుగా వెంకటేశ్‌గౌడ్, నారాయణయాదవ్, నర్సింహులు, వెంకటేశ్‌యాదవ్, కో-కన్వీనర్లుగా దిలీప్‌కుమార్, శరత్‌కృష్ణ, పాండురంగారెడ్డిలను ఎన్నుకున్నారు.

గ్రూప్-3 పరీక్షకు సర్వం సిద్ధం

స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

యాలాల, నవంబర్ 5 : గ్రూప్-3 పరోక్ష నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ చర్యలను తీసుకున్నామన్నారు. తాండూరులో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం స్ట్రాంగ్ రూంను పరిశీలించారు.



సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు మాజీ ప్రజాప్రతినిధుల మెమోరాండం

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

దౌల్తాబాద్, నవంబర్ 5 : గ్రామాల అభివృద్ధి కోసం కష్టపడి అప్పులు చేశామని.. 11 నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ ప్రజాప్రతినిధులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు మెమోరండం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహిపాల్ ముదిరాజ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్‌లు శిరీష, అశోక్, గోవింద్, నారాయణ్‌రెడ్డి, బుడ్డప్ప, జనార్దన్‌రెడ్డి, సోమయ్య, రాంరెడ్డి, వెంకటప్ప, నర్సింహారెడ్డి, మహేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

రేవంత్ సర్కారుతో తాడోపేడో తేల్చుకుంటాం

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కాళ్ల జంగయ్య

యాచారం, నవంబర్ 5 : ఆసరా పింఛన్ పెంపు విషయంలో రేవంత్ సర్కారుతో ఇక తాడోపేడో తేల్చుకుంటామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. మండలంలోని మాల్‌లో ఆసరా పింఛన్‌దారుల ఆవేదన సభను వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఆసరా పింఛన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. రేవంత్ సర్కార్ దిగొచ్చే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు లేవదీయనున్నట్లు తెలిపారు. అధికారంలోకి రాగానే పింఛన్‌లు పెంచుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు గద్దెనెక్కి, పదవులు అనుభవించి పదకొండు నెలలు కావస్తున్నా పింఛన్ పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. దివ్యాంగులతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తులో పరాభవం తప్పదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడమే ఆసరా పింఛన్‌దారుల ప్రధాన లక్ష్యమన్నారు. ఇకపై కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా అడ్డుకుంటామని, పింఛన్ పెంచేవరకు సర్కారు మెడలు వంచుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఆసరా పింఛన్‌దారుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రూ.4016, దివ్యాంగులకు రూ.6016 పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 10న ఇబ్రహీంపట్నంలో భారీ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, 26న పెద్దఎత్తున చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత నెల 30 నుంచి నవంబర్ 28 వరకు హ